ఈ వారం కథ

చిక్కగా వున్న ఆమె పాలిండ్ల మధ్య అతడు మొహం దాచుకుని గాఢంగా ఊపిరి పీల్చి వదిలాడు. అతడికి బాగా పరిచయమైన ఆమె శరీర పరిమళం తన ముక్కు పుటాలకు సోకాక బద్ధకంగా వొళ్ళు విరుచుకుంటూ పక్కకు వొత్తిగిల్లాడు. అంతలోనే ఆమె రొమ్ములలోకి వొక పసిపాపడిలా తిరిగి వొదిగిపోయాడు. ఆమె కొన్ని క్షణాల పాటు అతడి జుత్తును నిమురుతూ వుండిపోయింది. మగత నిద్ర కమ్ముకొస్తుండగా అతణ్ణి మరింత హత్తుకుంటూ వొక్కసారిగా ఉలిక్కి పడింది.

# పుష్ప గుచ్ఛం

'హేయ్.. లే.. యిదే మనకిక ఆఖరు' అంది అతణ్ణి తోసేస్తూ.

అతడు దిగ్భ్రమ చెందాడు. వ్యాకులత నిండిన కళ్ళతో ఆమె మనసును అంచనా వేయడానికి పూనుకున్నాడు. పరిహాసమాడుతున్నదేమోనని పరిశీలన చేశాడు.

'అవును.. యిది నిజం! నీకూ నాకూ యిక యెడబాటు తప్పదు. సెలవు' నైటీని అరిపాదాల మీదుగా కప్పుకొంటూ గోడకు చేరగిలబడి కూర్చొంది.

అతడు అసంకల్పితంగా లేచి కూర్చున్నాడు. కాసేపటి తర్వాత మోకాళ్ళ మధ్య చుబుకాన్ని యిరికించుకొని యెటువంటి భావ ప్రకటనా లేకుండా చూస్తుండి పోయాడు.

'ఈ సంబంధం మనకిక తగదు. రేపు నా భర్త వస్తున్నాడు. అతడు మంచివాడు. సౌజన్యమూర్తి. నా పట్ల ప్రేమ, అపేక్ష కలిగివున్నవాడు. నా సౌఖ్యం కోసం పరదేశాలకు వెళ్ళి డబ్బు సంచులతో తిరిగి వస్తున్నాడు. అతడికి ద్రోహం చేస్తున్నాననే యోచన నాకు దుర్భరంగా వుంది. మన్నించు. నాపై దయవుంచి యిక యిటువైపు రాకు' విచారవదనంతో అంది.

తానడగని విషయానికి ముందే సంజాయిషీ ఇస్తున్న ఆమె వైపు అతడు కొత్తగా చూశాడు.

'నీవు పరిచయం కావడం నా పూర్వజన్మ సుకృతం. నీవల్ల భౌతికంగా, మానసికంగా జీవితకాలానికి సరిపడా ఆనందాన్ని అనుభవించాను. యిక చాలు! నీవు నాకు మిత్రుడివిగా వుండు. అంతే నేను కోరుకునేది' వేళ్ళ చివరలను చూసుకుంటూ అంది.

అతడు లేచి గోడకు వేలాడదీసిన పంట్లాంనూ, చొక్కానూ తొడుక్కున్నాడు. ముభావంగా కుర్చీలో కూర్చుని బూట్లకు లేసులు బిగించి కట్టుకున్నాడు. కుడివైపు మీసం చివరను మునిపంటి కింద రెండుమూణ్ణిముషాల సేపు కొరికి, చివరకు మాట్లాడాడు.

'మంచిది. నీ నిర్ణయాన్ని వ్యతిరేకించే సాహసం చేయను. ఆడవాళ్ళు బహు కఠిన హృదయులని నిరూపించినావు. నాకు తెలుసు. మీ ఆడవాళ్ళకు మగవారి మనసులతో ఆడుకోవడం వేడుకను కలిగించే క్రీడ. అయినా ఆడవాళ్ళ మనసెరిగి ప్రవర్తించడంలో మూర్ఖపుటెత్తులు వేసేంత మందబుద్ధిని కాను. నీ భర్తకు నా ప్రగాఢ సానుభూతి. వస్తాను' లేచాడు.

ఆమె వొక్కసారిగా మంచం మీద నుంచి ప్రవాహంలా కదిలి వచ్చి అతణ్ణి చుట్టుముట్టింది. మునిగాళ్ళ మీద లేచి నిలబడి తన బాహువులలో అతణ్ణి బంధించి వేసింది. మోహాన్ని ప్రదర్శిస్తూ ముద్దులతో ముంచెత్తింది. కన్నీళ్ళతో అతడి బుగ్గలను తడిపేసింది.

'ఏం చేయను? నిజానికి నీ మీద నాకున్న భ్రాంతి యింకా చచ్చిపోలేదు. నీలోని నా పురుషుడిపై ప్రీతి తరిగిపోలేదు. నీవు యెంతగా నా జీవితంతో పెనవేసుకుపోయావో! యిలా జరుగుతుందని ఊహించలేదు. నీవు నాకు కావాలి. కాని యెలా సాధ్యం? నా భర్త తిరిగి వస్తున్నాడు. అతడి పట్ల నాకు అమితమైన ప్రేమ, నమ్మకమూ వున్నాయి. అతడి సమక్షంలో నేను సుఖంగా వుండగలను. మీలో వొకరిని కోల్పోవాల్సొస్తుందన్న ఆందోళనలో నీ మనసును నొప్పించే వ్యర్థ ప్రసంగం చేశాను. తప్పుపట్టకు' అతడి వక్షంపై తల ఆన్చి రోదించ సాగింది.

అతడు ఆమె వైపు వెర్రిగా చూశాడు. ఆమె మాటల్లోని సత్యశీలతను గ్రహించడానికి కొన్ని క్షణాలపాటు తీవ్రంగా మథనపడ్డాడు.

'నీవు ఏ ఆడది ఆశించని, ఆశించకూడని, ఆశించ తగని ఆలోచన చేస్తున్నావు. దీనిని సమాజంలోని అనేకానేక మంది పెద్దలు హర్షించరు. వారు మన అనుభూతులకు, సంతోషాలకు, ప్రేమకు, మనసుకు కటకటాలు బిగించగల నేర్పరులు. నీవు చెప్పినట్టుగా మనం విడిపోవడమే మంచిది' అన్నాడు.

అతడిలో యిందాకటి ఆవేశం పూర్తిగా తగ్గిపోయింది. శాంతంగా మాట్లాడుతున్నాడు.

ఆమె మారం చేసే పసిపిల్లలా తల అడ్డంగా వూయించింది. అతడి రెండు చేతులనూ తన భుజాల మీద వేసుకుంటూ 'మనకు కావలసినది మనం పొందడం యెంత మాత్రమూ వింత కారాదు. నీ విషయం నా భర్తతో మాట్లాడుతాను' అంది.

* * *

సోఫియా ఫెర్నాండెజ్- చామన చాయలోనే చర్మంతో మిసమిసలాడుతూ కనిపించే ముప్పై అయిదేళ్ళ ప్రౌఢ. మోకాళ్ళను దాటే పొడవైన స్కర్ట్‌లను ధరించి ఎత్తు మడమల చెప్పులతో ఆమె తరచూ కాయగూరలు కొనడానికి బయటికి వచ్చేది. లేదంటే భర్త పంపే డబ్బులను బ్యాంకులో జమ చేయడానికో, తిరిగి పొందడానికో వెడుతున్నప్పుడు ఆమె బజారులలో కనిపించేది. ఆమె ఎప్పుడూ జుత్తును కొప్పేసి అందులో పచ్చ చేమంతి పువ్వునో, మరువం రెమ్మలనో తురుముకొని వుండేది.



అత్తెసరు బతుకుతో విసిగిపోయిన ఆమె భర్త మార్టిన్ ఫెర్నాండెజ్ డబ్బు యావ పట్టి చమురు దేశాలకు వెళ్ళిపోయాక సోఫియా వొంటరిగా మిగిలిపోయింది. పనికి మాలిన ఆలోచనలు ముప్పిరిగొనే ఏకాంతాన్ని భగ్నం చేయడానికి ఆమె సతమతమయ్యేది. యెక్కువగా ఆమె, పెరట్లోని పూల మొక్కల బాగోగులు చూసుకుంటూనో, యింట్లోని వస్తువులను ఆ మూల నుంచి ఈ మూలకు కాస్త అటూ యిటుగా మార్చి తృప్తి పడుతూనో కాలం వెళ్ళబుచ్చేది... శ్రీ.. పరిచయమయ్యేదాక.

శ్రీ.. పైకి చలాకీగా కనిపించే పాతికేళ్ళ సోమరి యువకుడు. యూనివర్శిటీ చదువు పూర్తయ్యాక సులభంగా డబ్బులొచ్చిపడే మార్గాల కోసం అతడు అన్వేషిస్తుండేవాడు. సోఫియా వాళ్ళ వీధి చివర చిన్న గదిలో అద్దెకుండేవాడు. అతడికి గదిలో ఉబుసుపోనప్పుడు వీధి గడపల్లో కూర్చుని, వచ్చే పోయే వారిని చూస్తూ కాలక్షేపం చేస్తుండేవాడు. ఆ విధంగా సోఫియాతో అతడికి ముఖ పరిచయం ఏర్పడింది.

'మేడమ్ సోఫియా ఫెర్నాండెజ్! మీ గురించి మా యింటి యజమానురాలు చెప్పగా తెలుసుకున్నాను. నేను నిరుద్యోగిని. ఈ దేశంలో సజావుగా బతకడానికి సరిపడా ఉద్యోగం దొరకడం దుర్లభమని తెలుసుకున్నాను. మీ భర్తకు వీసా యేర్పాటు చేసిన ఏజెన్సీ వివరాలు చెప్పి సాయపడండి. పుణ్యముంటుంది' అనేది ఆమెతో అతడి తొలి సంభాషణ.

ఆవిధంగా అతడు సోఫియా ఏకాంత జీవితంలోకి అడుగుపెట్టాడు. వేగంగా, దూకుడుగా, జలపాతంలా ఆమె గడప నుంచి పడగ్గదికి చేరుకున్నాడు. సోఫియా, నడి ప్రాయంలో పరిపూర్ణమైన ఆరోగ్యంతో గాఢమైన కోర్కెలను కలిగివున్న స్త్రీ కావడం చేత అతణ్ణి చాలా సహజంగా అక్కున చేర్చుకుంది. అది వొక ప్రకృతి సిద్ధమైన చర్యగా ఆమె భావించింది. నిద్రాణమై వున్న స్త్రీ సహజ కాంక్షలన్నింటినీ అతడి చేత లాలించుకుంది. పాలించుకుంది. యెన్నటికీ యెడతెగని అతడి చతుర సంభాషణ వల్ల ఆమె మాటలు నేర్చుకున్నది.

చిర్నవ్వులను పూయించే అతడి పెదాలను చూసి భర్త యెడబాటు మిగిల్చిన వెలితిని మర్చిపోగలిగింది. శ్రీ.. తోడు వుండిన ప్రతిక్షణంలోనూ ఆమె సంతోషంతో ఓలలాడింది. ఆ సంతోషం శాశ్వతమని విశ్వసించి అది చేజారిపోతుందేమోనన్న ఆందోళనతో తల్లడిల్లేది.

యిప్పుడు భర్త పునరాగమనం ఆమెను యింతకు మునుపెన్నడూ యెరగని సంక్షోభంలో పడవేసింది. తాను మనస్ఫూర్తిగా యిష్టపడే యిద్దరు పురుషులలో వొకరిని కోల్పోయేందుకు ఆమె సిద్ధంగా లేకపోయినది. ఆ ఆలోచన రావడంతోటే ఆమె బేలవోలే పెద్దగా యేడ్చేసేది. ఒక స్త్రీ యిద్దరు పురుషులను కోరుకోవడం యే విధంగా పాపమో, నేరమో తెలియక తనలో తాను గంటల తరబడి తర్కించుకునేది. శ్రీ.. తో తన సంబంధం గురించి మార్టిన్‌కు తెలియజెప్పడం చివరకు మేలనుకుంది.

పల్లటి అద్దె కారులో పెద్ద పెద్ద సూట్ కేసులతో యింటికి చేరుకున్న మార్టిన్‌కు విప్పారిన మొహంతో ఆమె స్వాగతం చెప్పింది. అతణ్ణి ఆర్తిగా కావలించుకుని కుశల ప్రశ్నలడిగింది. తన వొడిలో తలపెట్టుకుని విశ్రమిస్తున్న అతడి ఫాల భాగాన్ని ముద్దాడుతూ మృదువుగా చెప్పింది.

'ప్రియా... మార్టిన్! రేపు మనింటికి వొక మిత్రుడు విందుకు వస్తాడు. అతడు మీకు బొత్తిగా అపరిచితుడు. అతడితో మనం మాట్లాడాల్సిన అవసరం వుంది'

* * *

సోఫియా చెప్పినదంతా మార్టిన్ ఫెర్నాండెజ్ సాంతం విన్నాడు. మధ్యమధ్యలో సాయలుగా నెరసిన చిరి గడ్డాన్ని నిమురుకుంటూ, మసాలా దట్టించి వేయించిన జీడిపప్పును పరా... పరా నములుతూ నిర్లిప్తంగా విన్నాడు. సోఫియా చెప్పడం ముగించేసరికి అతడు కేవలం రెండు మూడుసార్లు 'ఊ' అనడాన్ని శ్రీ.. గమనించాడు. సోఫియా తమ సంబంధం గురించి చెబుతున్నప్పుడు మార్టిన్ ఆమెను కసిదీరా చితకబాదుతాడని శ్రీ.. ఊహించాడు. వీలైతే తను దెబ్బలు తినడానికి సిద్ధపడి వున్నాడు.

కాని మార్టిన్ వాలకం చూస్తుంటే తననన్నీ అర్థరహిత భయాలేనని అతడికి అనిపించింది. మార్టిన్ తనకు హానీ తలపెట్టడని నమ్మకం కుదిరాక అతడు కుర్చీలో వెనక్కు వాలి, తల పైకెత్తి పైకప్పు కేసి చూస్తూ కూర్చున్నాడు.

సోఫియా భర్త వైపు రెప్ప వాల్చకుండా కన్నులింత జేసుకుని చూస్తూ కూర్చుంది. అతడు తక్షణం యేదో ముఖ్యమైనది, మహా విలువైనది చెప్తాడనే నిరీక్షణతో చూసింది. మార్టిన్ ఆమెతో యేమీ అనలేదు. కానీ, యేదో నూతనమైనదీ, అరుదైనదీ సంభవించనున్నదని ఆమెకు అనిపించింది. తన సమస్యను విప్పి చెప్పాక అతడి జవాబు కోసం ఆమె నిరీక్షించింది, దేనికైనా సిద్ధపడి, మృత్యువుకైనా సరే!

కాసేపయ్యాక మార్టిన్ తన ఎడమ పిర్రను పైకి లేపి సర్దుకు కూర్చుంటూ అన్నాడు.

'పెళ్ళి... యెంతటి కపట చట్రమో నీకు యిప్పటికైనా అర్థం కాలేదా... సోఫియా?'

ఆ ప్రశ్నకు ఆమె వులిక్కి పడింది. అయోమయంగా చూసింది.

'జ్ఞాపకముందా ఆరోజు? నీవు మీ తాతగారి ఊర్లో పరిచయమయ్యావు. మనం కలిసి జీవించడానికి నేను ప్రతిపాదించాను. నువ్వు పెళ్ళన్నావ్. స్త్రీ పురుషులు కలిసి జీవించడానికి అది తప్పనిసరి అన్నావు. యిప్పుడు చూడు... ఆ చట్రంలో నువ్వు బందీవై పోయావు. భార్యగా నాకు లొంగిపోయావు. నీ జన్మమీదే గుత్తాధిపత్యం చలాయించే శక్తి నాకిచ్చావు. నీ వ్యక్తిగత జీవితాన్ని కోల్పోయావు...'

సోఫియా అతణ్ణి అలాగే చూస్తుండిపోయింది. శ్రీ.. అతడు కదిల్చిన మాటల తీగె రెండవ చివరను కనిపెట్టడానికి దేవులాడుతున్నాడు.

మార్టిన్ గాజు లోటాలోని నీళ్ళు తాగి అరి చేతులను తొడలకు రుద్దుకుంటూ మళ్ళీ చెప్పాడు.

'ఈ చట్రమే కాదు... మన చుట్టూ మనల్ని కబళించడానికి కోరలు సాచివున్న యే చట్రమైనా యిలాగే తగలడింది. బహిర్గతం వొకటి, అంతర్గతం వేరొకటి. చూపరుల కోసం జీవించే బూటకపు జీవితాన్ని ఛేదించి, మనకై మనం జీవించే రహస్య జీవితాన్ని బహిర్గతం చేయగల స్వేచ్ఛ మనిషికి కావాలి. అది మనకు లేదు... వుంటే ఈ కుర్రవాడితో కలిసి వుండడానికి నన్ను అనుమతి అడిగేదానివా... సోఫియా?'

మార్టిన్ మాటలకు సోఫియా మనసు తేలికపడింది. అతడు చెప్పేది ఆమెకు కాస్త గందరగోళంగా అనిపించినా తన పట్ల అతడు అనుకూలంగా స్పందించడం ఆమెకు ఆనందాన్ని కలిగించింది. శ్రీ.. గురించి భర్తతో చెప్పి తాను తప్పు చేయలేదన్న విషయం ఆమెకు స్ఫురించింది.

'ఉండండి... టీ తెస్తాను' అని ఉత్సాహంగా వంట గదిలోకి వెళ్ళింది.

ఆమె అలా లోపలకు వెళ్ళగానే మార్టిన్ మొహాన్ని ముడుచుకుంటూ శ్రీ.. వైపు తిరిగాడు.

'నిజం చెప్పండి మహాశయా! ఈమె పట్ల యింకా మీకు వాంఛ చావలేదా?' అడిగాడు.

'వాంఛ? ఏమంటున్నారు మీరు మిస్టర్ మార్టిన్ ఫెర్నాండెజ్? వాంఛ? ఆమె పట్ల నేను ప్రేమ కలిగివున్నాను'

'ప్రపంచ భాషలన్నింటిలోనూ అంతకు మించిన కపట పదాన్ని నేను గుర్తించలేదు. ప్రేమ అనవద్దు. ఆకర్షణ లేదా కోరిక అనండి'.

శ్రీ.. మౌనం దాల్చాడు.

'జీవితకాలం పాటు మనుషుల్ని భరించడం యెంతటి నరకప్రాయమో మీకు తెలియదా శ్రీ..? అది కూడా వారి బలహీనతలను మన భుజస్కంధాల మీద శిలువను మోస్తున్నట్టుగా మోయడం...'

'మీరు నిజం మాట్లాడుతున్నారు...'

'సోఫియా కూడా అంతే. విషయాలను సాపేక్ష దృష్టితో చూసినపుడు ఆమెకు మొన్న నేను, నిన్న మీరు, యివాళ మనిద్దరం...'

శ్రీ..కు మార్టిన్ భాష క్రమంగా అర్థమవసాగింది. అది వొక మగవాడి భాష. ఆ భాషలోనే తానూ సంభాషించడం అత్యవసరమని శ్రీ.. గ్రహించాడు.

'నిజమే. కాని ఆడ, మగ సంబంధాల విషయంలో మగవారు మాత్రమే సాపేక్ష దృష్టిని కలిగి వుండడం మంచిదని నా వ్యక్తిగత అభిప్రాయం' అన్నాడు.

'భేషైన మాట చెప్పారు. నా స్థానంలో నీరొచ్చారని సోఫియా చెప్పిన తదుపరి క్షణంలోనే నేను ఆమెనూ, మిమ్మల్ని హత్య చేయాల్సింది. కాని మీకు వాస్తవం విశదపరచడానికి ఆమె ఎదుట అడ్డమైన సొల్లూ మాట్లాడాను'... ఆగాడు మార్టిన్.

సోఫియా వస్తున్నదేమోనని తొంగి చూసి, దాపులో ఆమె అలికిడి లేకపోవడంతో ముందుకు వంగి రహస్యం చెబుతున్నట్టుగా శ్రీ..తో మాట్లాడాడు.

'భర్త పట్ల విశ్వాసం చూపని ఈమె మీ వెంట మాత్రం ఎంత కాలం వుంటుంది శ్రీ..? మగవారిని లో దుస్తుల వలే మార్చే యిటువంటి ఆడదాన్ని నమ్మి ఎందుకు గాయపడతారు? మనం మగవారం! యిటువంటి చపలచిత్తురాలికి బుద్ధి చెప్పాల్సిన అవసరం వుంది. యేమంటారు?' అడిగాడు. భావరహితమైన దృక్కులతో శ్రీ.. నేల చూపులు చూడసాగాడు. మార్టిన్ పెద్దగా 'సోఫియా... వంచకి... మనకిక లేదు' అని అరిచాడు.

* * *

మార్టిన్‌కు యిప్పుడు యాభైయేళ్ళొచ్చాయి. గ్లోరీ ఆనెట్ అనే వితంతువుతో అతడు 'యిష్టం' ప్రాతిపదికగా వొక ఉత్తర కోస్తా జిల్లాలో వుంటున్నాడు. శ్రీ.. బాగా ఆస్తున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుని వొక బిడ్డకు తండ్రయ్యాడు. యిక సోఫియా! ఆమెకు బాగా వొళ్ళొచ్చింది. వెంట్రుకలు తెల్లబడి, చర్మం ముడతలు పడి వయసుకు మించిన దానిలా కనిపిస్తోంది. పొట్ట గడవడానికి ఆమె మొహింజాహీ మార్కెట్‌లో అందమైన పుష్పగుచ్ఛాలను అమ్ముతుండడం మీరు గమనించవచ్చు. తన దగ్గరకు పూలు కొనడానికి వచ్చే ఖాతాదారులలో శాస్త్రం తెలిసిన వారనిపించే మగవారిని ఆమె తరచూ వొక ప్రశ్న వేస్తుంటుంది.

'వంచకి అంటే యేమిటి?' అనే ఆమె ప్రశ్నకు యిప్పటివరకూ యెవళ్ళూ సరియైన సమాధానం చెప్పలేదు. ○